సాక్షి సిద్దిపేట

సోమవారం । 24 । మార్చి । 2025



ఎస్సీ రైతులకు ప్రోత్సాహం

కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ఆధునిక సాంకేతికతను చేరువ చేస్తుంది.

వివరాలు 8లో ▸



తేలిన కంకర..

కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్న గ్రామీణ ప్రాంత రోడ్లతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

గజ్వేల్ ఆత్మ కమిటీ చైర్మన్‌గా మల్లారెడ్డి

గజ్వేల్: మండల పరిధి బయ్యారం గ్రామానికి చెందిన మద్దూరి మల్లారెడ్డిని గజ్వేల్ ఆత్మ(అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ)కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో ఆయనతోపాటు మరో 24 మందిని డైరెక్టర్లుగా నియమించారు. ప్రభుత్వం తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించడంపై మల్లారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రెండో విడత మూల్యాంకనం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ రెండో విడత జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకులాలు, కేజీబీవీలలో భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రాల అధ్యాపకులను మూల్యాంకనం కోసం రిలీవ్ చేయాలన్నారు.

టాలెంట్ టెస్టులతో మరింత ప్రతిభ

ఎంపీ రఘునందన్‌రావు



విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీ రఘునందన్‌రావు

కొండపాక(గజ్వేల్): టాలెంట్ టెస్టులతో విద్యార్థుల్లో ప్రతిభ మరింత పెరుగుతుందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కుకునూరుపల్లిలో ఎంపీ జన్మదినం పురస్కరించుకొని కుకునూరుపల్లిలో బీజేపీ, ఎంఆర్ఆర్ యువసేన సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల కోసం కేంద్రం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి, ఎంఆర్ఆర్ యువసేనా అధ్యక్షుడు సదానందగౌడ్, నాయకులు పాల్గొన్నారు.


ఉగాది కవి సమ్మేళనం



పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వంగర నరసింహారెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం కవులకు సురవరం ప్రతాపరెడ్డి స్మారక సాహిత్య పురస్కారాలు అందించారు.

దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వానికి నివేదిక



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ రాధిక, ఏఓ శ్రీనాథ్

జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

సిద్దిపేటఅర్బన్: ఈదురుగాలులతో కూడిన కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక అన్నారు. ఆదివారం అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో మొక్కజొన్న పంటను ఏఓ శ్రీనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజులుగా కురిసిన వర్షాల వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ప్రాథమిక అంచనా మేరకు ఒక్క ఎన్సాన్ పల్లిలోనే సుమారు 20 ఎకరాలలో మొక్కజొన్న పంట నేలకొరిగిందన్నారు. నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

పంటల పరిశీలన

సిద్దిపేటరూరల్: మండల వ్యవసాయాధికారి నరేశ్ దెబ్బతిన్న పంటలను ఆదివారం పరిశీలించారు. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ళ వర్షం పలు పంటలు దెబ్బతిన్నాయి. చింతమడక, సీతారాంపల్లి, ఆంకంపేట, మాచాపూర్, రాఘవాపూర్ గ్రామాల్లోని పంటలను క్షేత్రస్థాయిలో తిరుగుతూ పరిశీలించారు.

చివరి వారం .. పోటెత్తిన భక్తజనం

కొమురవెల్లికి భక్తులు పోటెత్తారు. చివరి ఆదివారం మల్లన్న క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మూడు నెలలుగా కొనసాగిన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అర్ధరాత్రి నిర్వహించిన అగ్నిగుండాలతో వైభవంగా ముగిశాయి. అంతకుముందు పుష్కరిణిలో స్నానమాచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గంగిరేణు చెట్టువద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన అగ్నిగుండాలు కనులపండువగా జరిగాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)



గంగిరేణు చెట్టు వద్ద భక్తజన సందోహం

రాజగోపురం ఎదుట భక్తుల సందడి

గజవాహనంపై నాచగిరీశుడు

బ్రహ్మోత్సవ పరిమళాలతో నాచగిరి అలరారుతోంది. విశేషాలంకృతులైన లక్ష్మీనృసింహస్వామివారు ఆదివారం రాత్రి గజవాహనం అధిష్ఠించి ఊరేగారు. సెలవురోజు కావడంతో నాచగిరీశుని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. నేత్రపర్వంగా సాగిన బ్రహ్మోత్సవ వేడుకలు తిలకించి, గర్భగుడిలో కొలువైన లక్ష్మీసమేత నృసింహస్వామి వారిని దర్శించుకుని తరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శేషవాహనోత్సవ సేవ జరుగుతుందని ఆలయ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు.

– వర్గల్(గజ్వేల్)



గజవాహనంపై లక్ష్మీనృసింహస్వామి దర్శనం



నాచగిరీశుని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు

పనులు హడావుడి.. నాణ్యత కొరవడి



అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడుతోంది. గడువు ముంచుకొస్తుండటం.. పనులు హడావుడిగా చేపడుతుండటం.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా రూ.74.92కోట్లతో 766 సీసీ రోడ్లను మంజూరు చేశారు. ఇప్పటి వరకు రూ.33కోట్లతో పలుచోట్ల నిర్మాణాలు పూర్తికాగా.. నిర్మించిన ఏడు రోజులకే పగుళ్లు ఏర్పడుతున్నాయి. దీంతో నిధులన్నీ వృథా అవుతున్నాయి. మరోవైపు ఈ నెలాఖరులోగా మిగతా రోడ్ల నిర్మాణం పూర్తి కాకపోతే నిధులు రద్దవుతాయి. పనులు జరుగుతున్న తీరుపై 'సాక్షి' క్షేత్రస్థాయిలో పరిశీలించగా అనేక విషయాలు వెలుగుచూశాయి.

సాక్షి పరిశీలన

సాక్షి, సిద్దిపేట: సీసీ రోడ్ల నిర్మాణం పనులు నవంబర్, డిసెంబర్‌లోనే చేపట్టాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. పనుల ఎంపికలోనూ జాప్యం చేశారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనా విడుదలపై సందిగ్ధంతో కాంట్రాక్టర్లు సైతం వెనుకంజ వేశారు. గడువు తరుముకొస్తున్న సమయంలో నిధులు రద్దయ్యే అవకాశాలు ఏర్పడటంతో పనులు ఒక్కసారిగా స్పీడ్ పెంచారు. ఈ క్రమంలో పనులపై పర్యవేక్షణ కొరవడుతున్నట్లు స్పష్టమవుతోంది.

వారం రోజులకే సీసీరోడ్లు పగుళ్లు

- అధికారుల పర్యవేక్షణ కరువు
- 'ఉపాధి' కింద రూ.74.92కోట్లతో 766 రోడ్లు మంజూరు
- ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని గడువు
- ఇప్పటికే పలు చోట్ల రూ.33కోట్లతో నిర్మాణం

పై ఫొటోలో కనిపిస్తున్నది కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలోని సీసీ రోడ్డు. రూ.5లక్షలతో 96 మీటర్ల రోడ్ పనులను వారం క్రితమే పూర్తి చేశారు. పదికాలాల పాటు నాణ్యతగా ఉండాల్సింది పోయి వారంరోజుల్లోనే పగుళ్లు ఏర్పడ్డాయి. కాంట్రాక్టర్ల ధన దాహానికి లక్షలాది రూపాయలు వృథా అవుతున్నాయనడానికి ఇదే నిదర్శనం.

పర్యవేక్షణ అంతంతే

చేపడుతున్న అభివృద్ధి పనులపై పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉంది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పనులు సైతం స్థానిక రాజకీయ నాయకులు, వారికి తెలిసిన కాంట్రాక్టర్లతోనే చేపడుతుండటంతో నాణ్యత కొరవడుతోంది. గడువు సమీపిస్తుండటంతో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పనుల నాణ్యతను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

- మిరుదొడ్డి మండల కేంద్రంలో రూ.10లక్షల వ్యయంతో 15 రోజుల క్రితం 12 ఫీట్ల వెడల్పుతో 235 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ సీసీరోడ్‌కు వాటర్ క్యూరింగ్ చేయడం సదరు కాంట్రాక్టర్ మరిచారు. సీసీరోడ్డుపై మట్టి కట్టలు ఏర్పాటు చేసి నీటిని నింపి వాటర్ క్యూరింగ్ చేయాలి. క్యూరింగ్ చేయకపోవడంతో నాణ్యత తగ్గిపోతుందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- దుబ్బాక మండలం హబ్సిపూర్‌లో రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. నెల రోజుల క్రితం శంకుస్థాపన సైతం చేశారు. ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదు. దీంతో సీసీ రోడ్ నిర్మాణం అవుతుందా? కాదా? అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.



నాణ్యత లోపిస్తే బిల్లులు ఆపేస్తాం

ఎస్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణం ఈ నెల 25వ తేదీ వరకే టార్గెట్ పెట్టుకుని ముందుకు సాగుతున్నాం. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. రోడ్లను క్వాలిటీ కంట్రోల్ వారు రిజక్ట్ చేస్తే బిల్లు మంజూరు చేయబోం. జీపీలకు విడుదలైనప్పటికీ విడుదల చేయకుండా ఆపేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈఈ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్

తాగునీటి సమస్య రానివ్వొద్దు

- ముందస్తు చర్యలు చేపట్టండి
- పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక
- ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్‌లోని ఐడీఓసీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ మూడు జిల్లాల అదనపు కలెక్టర్లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో మంచి నీటి సమస్యతో పాటు ఏ ఇతర సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నీటి కొరత ఉన్న గ్రామాల్లో తాత్కాలిక బావులు, బోర్లను అద్దెకు తీసుకొని నీటిని అందించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి 3,500ఇళ్లు మంజూరయ్యాయని మంత్రి పొన్నం చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అధికారులకు ఆదేశించారు. ఇల్లు లేని పేదలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు.

రూ.20లక్షలు మంజూరు

ఎల్కతుర్తి మండలం దామర గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఉండడంతో ధర్మసాగర్ నుంచి దామర వరకు పైపులైన్ నిర్మాణానికి రూ.20లక్షలు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అదేవిధంగా తాగునీటి సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సమస్యపై ఫిర్యాదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా ప్రతి పేదవాడికి సన్నబియ్యం ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. మీ సేవ, ప్రజా పాలన ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో అర్హుల ఎంపిక పూర్తి చేయగానే రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆర్డీఓ రామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లతో రక్షణ

హుస్నాబాద్: తాటి చెట్లు ఎక్కే గీత కార్మికులకు కాటమయ్య కిట్లు రక్షణగా నిలుస్తున్నాయని మంత్రి పొన్నం అన్నారు. ఆదివారం పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు పట్టణంలోని ఆర్యవైశ్య భవన్ ఏసీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి దశలో 10 వేలు, రెండో దశలో 10 వేలు కిట్లను పంపిణీ చేశామన్నారు. జూన్ తరువాత రాష్ట్రంలో 40 లక్షల తాటి వనాలు, 40 లక్షల ఈత మొక్కలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌పై అవగాహన కల్పించారు.

బోనం.. ఘనం



బెజ్జంకి మండలంలోని వీరాపూర్‌లో దళిత, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, ఆయా కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

– బెజ్జంకి(సిద్దిపేట)

నష్టపోయిన రైతులను ఆదుకోండి



రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- దెబ్బతిన్న పంటల పరిశీలన

సిద్దిపేటరూరల్: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు తక్షణం నష్టపరిహారం అందజేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను అంచనా వేసి వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఎన్నో మాటలు చెప్పిన కాంగ్రెస్ నేటికీ అమలు చేయలేదన్నారు. రైతులకు రూ.2లక్షలు మాఫీ చేస్తానని చెప్పి పూర్తి స్థాయిలో మాఫీ చేయలేదన్నారు. రైతు భరోసా పేరిట ఇస్తానన్న డబ్బులు కూడా ఇవ్వలేదన్నారు. వెంటనే వర్షాకాలం, యాసంగి పంటల రైతు భరోసా రూ.15వేల చొప్పున అందించాలన్నారు.

స్వశక్తితో ఎదగాలి

సిద్దిపేటజోన్: నేటి యువత స్వశక్తితో ఎదగాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని మహిళలు, యువతుల కోసం ఆదివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడితే విజయం ఖాయమన్నారు. కష్టపడిన వారు జీవితంలో తప్పకుండా విజయం సాధిస్తారన్నారు.

కంటి దీపాలకు కనుచూపెవరు?

సుగుణమ్మ ముగ్గురు కుమారులూ అంధులే

- చిన్న కొడుకు నీటి గుంతలో పడి మృతి
- ఇంటి పెద్దను కాటేసిన కేన్సర్
- అంధులైన కొడుకులకు పిల్లనివ్వని దైన్యం
- నేను కనుమూస్తే నా బిడ్డలకు దిక్కెవరు?
- తల్లడిల్లుతున్న మాతృమూర్తి



తల్లి సుగుణమ్మతో ఇద్దరు కుమారులు

మెదక్‌జోన్: 'పెళ్లయిన మూడేళ్లకు మొదటి సంతానంలో కొడుకు పుట్టాడని ఆనందపడ్డాం. విశ్వనాథం అని కాశీ విశ్వనాథుడి పేరు పెట్టుకున్నాం. బుడిబుడి అడుగులు వేస్తుంటే సంబరపడ్డాం. కానీ.. మా సంతోషం ఎంతో కాలం నిలవలేదు. మా కుమారుడికి కళ్లు కనిపించవని వైద్యులు పిడుగులాంటి వార్త చెప్పారు. వరుసగా మరో ఇద్దరు కొడుకులకు సైతం అంధత్వం రావటంతో మా తలరాత ఇంతే అని సరిపెట్టుకున్నాం. చిన్నపాటి హోటల్ నడుపుకుంటూ పిల్లలను సాదుకుంటుండగా.. విధి పగ బట్టినట్లుగా కేన్సర్ మహమ్మారి నా భర్తను కాటేసింది. ఐదేళ్లకు చిన్నకొడుకు నీటి గుంతలో పడి మరణించాడు. దీంతో మా కుటుంబం చిన్నాభిన్నమైంది. ఉన్న ఇద్దరితో ఎలాగోలా నెట్టుకొస్తున్నా.. నేను పోయాక నా బిడ్డలను ఎవరు చూస్తారో..? తలుచుకుంటే కన్నీళ్లు ఆగడం లేదు' అని ఎనిమిది పదుల వయసులో సుగుణమ్మ ఆందోళన చెందుతుంది.

ఎన్నో ఆస్పత్రులు తిరిగినా..

మెదక్ పట్టణానికి చెందిన కందుకూరి కృష్ణ, సుగుణమ్మ దంపతులకు ముగ్గురు మగ సంతానం. పెద్ద కొడుకు విశ్వనాథం, రెండో కొడుకు సంతోష్, చిన్న కొడుకు రాము.. పుట్టిన ముగ్గురు అంధులే కావటంతో తమ బిడ్డల భవిష్యత్ కోసం ఎన్నో ఆస్పత్రులు తిరిగారు. హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్, సరోజినిదేవి, చెన్నైలోని శంకర్ నేత్రాలయం లాంటి ప్రముఖ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆశలు వదులుకొని పట్టణంలో చిన్నపాటి హోటల్ ఏర్పాటుచేసి జీవనం సాగించారు. కుటుంబం సాఫీగా సాగుతున్న తరుణంలో.. 2009లో ఇంటి పెద్ద కృష్ణకు కేన్సర్ సోకింది. ఎలాగైనా బతకాలని.. తనకేమైనా జరగరానిది జరిగితే అంధులైన తన బిడ్డల భవిష్యత్ ఏంటని ఎన్నో ఆస్పత్రులు తిరిగారు. అయినా ఫలితం లేకపోవటంతో కృష్ణ మరణించాడు. దీంతో కుటుంబ బాధ్యత పూర్తిగా సుగుణమ్మపై పడింది. ఉన్న హోటల్‌ను నడపలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి కిరాణం నడుపుకుంటూ జీవిస్తుండగా.. 2014లో చిన్నకొడుకు రాము ఏడుపాయల దుర్గమ్మ దర్శనానికి స్నేహితుల సహాయంతో వెళ్లాడు. అక్కడ బహిర్భూమికి వెళ్లి నీటి గుంతలో పడి మరణించాడు.

పింఛనే పెద్ద ఆసరా

ఉన్న ఇద్దరు కొడుకులను ప్రభుత్వ పెన్షన్‌తో సాదుకుంటోంది సుగుణమ్మ. ప్రస్తుతం ఆమెకు వృద్ధాప్యం మీద పడుతోంది. వయసు 80 ఏళ్లు. శరీరం సహకరించకున్నా అతికష్టం మీద వారికి వంట చేసి పెడుతోంది. తన తదనంతరం బిడ్డల పరిస్థితి ఏంటని మనోవేదనకు గురవుతోంది. తన పెద్ద కొడుకు విశ్వనాథంకు 40 ఏళ్లు ఉండగా.. పెళ్లి చేయాలని ఎంతగానో ఆరాట పడుతోంది.

క్లుప్తంగా

గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మైనర్ బాలుడి నుంచి అర్ధకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని మల్లికార్జున నగర్ కాలనీ వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలుడు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా అర్ధకిలో గంజాయి లభించింది. గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

149 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

దుబ్బాకరూరల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా డీసీఎంలో తరలిస్తుండగా అక్బర్‌పేట భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చిట్టాపూర్ గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం... శనివారం ఉదయం 6 గంటల సమయంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చి లోడ్‌తో ఉన్న డీసీఎంను తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. సిద్దిపేట ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు కరీంనగర్ జిల్లాలో బియ్యాన్ని లోడ్ చేసుకొని భూంపల్లి మీదుగా తరలిస్తుండగా పట్టుకున్నారు. దాంట్లో దాదాపుగా 289 బ్యాగుల్లో 149 క్వింటాళ్లకుపైగా బియ్యం ఉన్నట్లు తెలిపారు. నిందితులు ఎండి.సయ్యాద్ అల్తాఫ్, సాయికుమార్, ప్రశాంత్, శశికుమార్, నరేష్, అశోక్, సోహెల్, మోజస్, నరేందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సాయిరవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

జహీరాబాద్ టౌన్: వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మోసిన్(38) అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... రాంనగర్‌కు చెందిన మోసీన్ ఆటో డ్రైవర్ కావడంతో ఈ నెల 17న కిరాయికి హైదరాబాద్‌కు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించారు. అతడికి భార్య ఫోన్ చేస్తే కలవడం లేదు. భార్య సహారా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట బాలిక...

జహీరాబాద్ టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన జహీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... పట్టణంలోని రాంనగర్‌కు చెందిన రాథోడ్ కవిత రెండో కూతురు నిరూపా(24) ఇంటి వద్దే ఉంటుంది.ఈ నెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి పుట్టినరోజుకు వెళ్లిన యువకుడు


పృథ్వీరాజ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): స్నేహితుడి పుట్టిన రోజుకని వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... కంకిపాటి సుబ్బరాజు తన కుటుంబ సభ్యులతో సంవత్సరం నుంచి మండలంలోని కూచారం గ్రామంలో నివాసం ఉంటూ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఇతడి కుమారుడు పృథ్వీరాజ్ (28) స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 20న తన స్నేహితుడి పుట్టిన రోజు ఉందని ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోగా ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, పోలీసుల కథనం ప్రకారం... క్యాసారం గ్రామ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ. 29,430 నగదుతో పాటు 6 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ రైతులకు ప్రోత్సాహం

రైతు నేస్తం కృషి విజ్ఞాన కేంద్రం

- సాంకేతిక సహాయం, క్షేత్ర పర్యటనలు
- జీవన ఎరువు, నీమ్ ఆయిల్, విత్తనాలు, నారు పంపిణీ
- ప్రకృతి, సేంద్రియ సాగుపై రాయిలాపూర్, తునికి, పోతిరెడ్డిపల్లి అన్నదాతలకు శిక్షణ


తునికి కేవీకేలో ఎస్సీ రైతులకు కూరగాయల నారు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

రైతులకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం ఆధునిక సాంకేతికతను చేరువ చేయడంతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తోంది. ప్రకృతి, సేంద్రియ సాగులో శిక్షణ అందిస్తూ ఎస్సీ రైతులను ప్రోత్సహిస్తోంది.

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలంలోని తునికి వద్దగల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే రెండు గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి 500 మంది రైతులతో సేంద్రియ సాగు చేయిస్తోంది. మండలంలోని తునికి, రాయిలాపూర్, కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామాలను ఎంపిక చేసి ఎస్సీ రైతులకు ప్రత్యేక శిక్షణతోపాటు ప్రోత్సాహకాలు సైతం అందిస్తున్నది. ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక ద్వారా ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసర్చ్) సహకారంతో కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక ఇన్‌చార్జి, శాస్త్రవేత్త శ్రీనివాస్, కేవీకే శాస్త్రవేత్తలు ఎస్సీ రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే 40 శాతం ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేసి శిక్షణనిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో మరిన్ని గ్రామాల్లో ఎస్సీ రైతులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.


కేవీకే పంపిణీ చేసిన కోళ్లు ఇవే..

సాగుపై రైతులకు అవగాహన

ఎంపిక చేసిన ఎస్సీ రైతులకు క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి సాగుపై శిక్షణనిస్తున్నారు. కేవీకేలో పలు పంటలను సాగు చేసే విధానం, విత్తనం నాటడం మొదలు పంట కోతకు వచ్చే వరకు జీవామృతం, బీజామృతం తయారీ, జీవన ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, వివిధ ఆకులతో కషాయాల తయారీ, నీమ్ ఆయిల్ వాడకంపై అవగాహన కల్పించారు. ఎస్సీ రైతులకు వానాకాలం, యాసంగికి గాను ఎరువులు, వర్మీకంపోస్ట్, కేఎన్ఎం1638 వరి విత్తనాలు, టమాట, మిరప, ఉల్లినారుతోపాటు అదనపు ఆదాయం కోసం ప్రియాబ్రీడ్ నాటుకోడి పిల్లల పంపిణీ, కలుపు తీసే యంత్రం, స్ప్రేయర్లు అందజేశారు. అలాగే భూసార పరీక్షలు చేయించి దాని ఆధారంగా ఏ పంట వేయాలి? ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో మెలుకువలు నేర్పి మూడేళ్లుగా ప్రోత్సహిస్తున్నారు.


కేవీకేలో జీవామృతం తయారీపై శిక్షణ

రెతుల ఆర్థికాభివృద్ధికి కృషి



ఐసీఏఆర్ సహకారంతో కేవీకే ఆధ్వర్యంలో ఎస్సీ రైతుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. క్షేత్ర స్థాయిలో రైతులకు సాగుపై ప్రత్యేక శిక్షణతో పాటు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు పూర్తి స్థాయిలో సేంద్రియ, ప్రకృతి సాగుకు ముందుకు రాకపోవడంతో కొద్దికొద్దిగా సాగు చేయిస్తున్నాం. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక ఇన్‌చార్జి, శాస్త్రవేత్త

సహకారం బాగుంది



కేవీకే సహకారం బాగుంది. ఎకరంలో సేంద్రియ సాగు చేస్తున్నా. కేవీకే శాస్త్రవేత్తలు వరి విత్తనాలు, కూరగాయల నారు, కోడిపిల్లలు అందజేశారు. కేవీకేలో సేంద్రియ సాగు, చీడపీడల నివారణపై శిక్షణ ఇచ్చారు. పంటలో సమస్యలు వస్తే ఫోన్ చేస్తే స్పందించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం వరితోపాటు కూరగాయలు, ఉల్లిగడ్డ సాగు చేస్తున్నా.

–సాయిలు, రైతు, పోతిరెడ్డిపల్లి

భర్తను చంపేందుకు కారుతో ఢీకొట్టి..

- ప్రియుడితో కలిసి భార్య స్కెచ్
- తప్పించుకున్న భర్త పోలీసులకు ఫిర్యాదు
- కేసు ఛేదించిన పోలీసులు


హత్యాయత్నానికి ఉపయోగించిన నలుపు రంగు కారు

మునిపల్లి(అందోల్): కట్టుకున్న భర్తను కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రియుడితో కలిసి భార్య కుట్ర చేసిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. అప్రమత్తమైన భర్త తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం... పెద్ద గోపులారం గ్రామానికి చెందిన కొమిశెట్టిపల్లి రవి ఝరాసంగం మండలంలోని దేవరాంపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే ఈ నెల 22న బైక్‌పై వెళ్లి విధులు నిర్వహించుకొని బుదేరా నుంచి గోపులారానికి వస్తున్న క్రమంలో నల్ల రంగు తార్ కార్‌తో రవిబైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయారు. బైక్‌పై నుంచి కిందడిన రవి అప్రమత్తమై తప్పించుకొని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఫాస్ట్ ట్రాక్ డిటేల్స్ ద్వారా నేరస్తులను గుర్తించారు. హత్య చేయడానికి గల ముఖ్య కారణం రవి భార్య హరితనే తేల్చారు. హరిత సంగారెడ్డికి చెందిన మిర్‌దొడ్డి సాయి ప్రదీప్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. దీంతో భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకొని ప్రియుడుతో కలిసి భర్త హత్యకు పథకం రచించింది. దీంతో ఏ1గా హరిత, ఏ2 మిరుదొడ్డి సాయి ప్రదీప్, ఏ3 దాసోజీ సాయికిరణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు. అక్కడి నుంచి జైలుకు పంపించారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్‌ఐ ఎం. రాజేశ్ నాయక్, కానిస్టేబుల్స్ పాండు, తుకారాం, హనీఫ్, సునీల్‌లను కొండాపూర్ సీఐ వెంకటేశం అభినందించారు.

పేద రోగులకు 'సంజీవని'

సెంట్రల్ క్రైం బ్రాంచ్ డీసీపీ శ్వేత


చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీసీపీ శ్వేత

కొండపాక(గజ్వేల్): సత్యసాయి సంజీవని ఆసుపత్రి దేవాలయం లాంటిదని సెంట్రల్ క్రైం బ్రాంచ్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్.శ్వేత పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాకలోని సత్యసాయి సంజీవని హార్ట్ కేర్ సెంటర్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ చాక్లెట్స్, గిఫ్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సత్యసాయి ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా పుట్టిన పసి బిడ్డ నుంచి 18 ఏళ్ళ లోపు వారందరికి రూపాయి ఖర్చు లేకుండా గుండె ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. చిన్నారుల గుండె ఆపరేషన్లు జరుగుతున్నంత సేపు తల్లిదండ్రులు పడిన బాధను చెబుతుండటాన్ని చూసి చలించిపోయానన్నారు. ఆసుపత్రి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో నవంబరు నుంచి మార్చి వరకు తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు 83 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు విజయవంతం చేశామన్నారు. అనంతరం ఆపరేషన్లు పూర్తయిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వహణ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి గృహిణి ఆత్మహత్య


రత్నమ్మ (ఫైల్)

సంగారెడ్డి క్రైమ్: అనారోగ్య సమస్యలు భరించలేక చెరువులో దూకి గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్ కథనం ప్రకారం... కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన గూడెం రత్నయ్య, రత్నమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కూమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గత ఏడాది కుమారుడు చనిపోవడంతో, రత్నమ్మ (40) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో రోజు రోజుకు ఎక్కువ అవ్వడంతో నొప్పిని తట్టుకోలేక పోయింది. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం సంగారెడ్డి శివారులోని మహబూబ్ సాగర్ చెరువులో మృతదేహం బయటకు తేలింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి రత్నమ్మగా గుర్తించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ఉరివేసుకొని..


ఎల్లయ్య(ఫైల్)

దుబ్బాకరూరల్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం... సిర్ర ఎల్లయ్య (43) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి మద్యానికి అలవాటు పడి ఇంటికి వచ్చి భార్యతో తరచుగా గొడవ పడు తుండేవాడు. మద్యం తాగవద్దని భార్య చెప్పినా వినేవాడు కాదు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో పశువులకు గడ్డి కోసుకువస్తానని ఇంట్లో చెప్పి పొలం వద్దకు వెళ్లాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానం వచ్చి పొలం దగ్గరకు వెళ్లి చూడగా తాడుతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు నలుగురు మృతి

బావిలో పడి రైతు..


నర్సింహులు(ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాదవ శాత్తు వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. వరి పొలానికి వరుస తడి పారించేందుకు వెళ్లిన రైతు బావిలో శవమై కనిపించాడు. ఈ ఘటన మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై షేక్ మహబూబ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వంగపల్లి నర్సింహులు(47) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. తన పొలంలో సాగు చేసిన వరికి వరుస తడి పారించేందుకు రాత్రి వెళ్లి ఉదయమైనా ఇంటికీ రాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెళ్లి పొలం వద్ద వెతకగా బావిలో శవమై కనిపించాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు..


బాలయ్య(ఫైల్)

పాపన్నపేట(మెదక్): స్టార్టర్ డబ్బా విప్పే క్రమంలో సరీస్ వైర్ నుంచి విద్యుత్ సరఫరా జరిగి ఓ కౌలు రైతు మృతి చెందిన ఘటన పాపన్నపేటలో ఆదివారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బట్టి బాలయ్య (57) ఓ వ్యక్తికి చెందిన పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. బోరు మోటర్ కాలిపోవడంతో మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లాడు.అనంతరం స్టార్టర్ డబ్బా తీసుకెళ్లే ప్రయత్నంలో దాన్ని ముట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య కిష్టమ్మ, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు..


దుర్గయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు నీట మునిగి మరణించిన ఘటన పాపన్నపేట మండలంలో ఆదివారం వెలుగు చూసింది. మల్లంపేట గ్రామానికి చెందిన కుర్మ సాయిలు కుమారుడు దుర్గయ్య(12) బడికి వెళ్లకుండా, వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి రెడ్ల చెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటిలో మునిగాడు. తోటి స్నేహితులు ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలుపగా, శనివారం సాయంత్రం చెరువులో వెతికినప్పటికీ ఆచూకీ దొరక లేదు. దీంతో తిరిగి ఆదివారం చెరువులో గాలించగా, దుర్గయ్య మృతదేహం దొరికింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సాయం చేయబోయి చెరువులో మునిగి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పెంపుడు కుక్కలకు స్నానం చేయించేందుకు చెరువుకు వెళ్లి బాలుడు నీట మునిగి మృత్యువాత పడిన ఘటన మండలంలోని మందాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నిమ్మల ఆరవింద్(17) అనే బాలుడు పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్దే పనులు చేస్తున్నాడు. కాగా ఆదివారం పెంపుడు కుక్కలను గ్రామంలోని బతుకమ్మ చెరువులో స్నానం చేయించేందుకు తీసుకెళ్లాడు. అప్పటికే గ్రామానికి చెందిన లింగాల వెంకటయ్య చేపలు పట్టడానికి చెరువులో వల వేసి ఉంచాడు. వెంకటయ్య చేపల వలను లాగమని అరవింద్‌కు చెప్పడంతో చెరువులోకి దిగి వలను లాగే ప్రయత్నంలో నీటిలో మునిగాడు. వెంటనే గ్రామస్తులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు చెరువు వద్దకు చేరుకొని అరవింద్‌ను చెరువులో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు.పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటయ్య నిర్లక్ష్యం వల్లే తన కొడుకు మృతి చెందాడని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాటరీ తగిలిందని వృద్ధురాలికి మాయమాటలు

రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడుతో గుర్తు తెలియని వ్యక్తి పరారీ

సిద్దిపేటకమాన్: ఓ వృద్ధ దంపతులకు గుర్తు తెలియని వ్యక్తి లాటరీ తగిలిందని మాయ మాటలు చెప్పి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడుతో ఉడాయించిన ఘటన సిద్దిపేట పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. దుబ్బాక మండలం పెద్దగుండెల్లి గ్రామానికి చెందిన తంగళ్లపల్లి వజ్రమ్మ, సుదర్శనాచారి దంపతులు సిద్దిపేట కుషాల్‌నగర్‌లో ఉంటున్న తమ కూతురు ఇంటికీ బస్సులో వచ్చారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి వారి కూతురు ఇంటి వైపు నడుచుకుంటూ వెళ్తుండగా దుర్గ చికెన్ సెంటర్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి తెలిసిన వ్యక్తిలా వారితో మాటలు కలిపాడు. లాటరీ తగిలిందని మాయ మాటలు చెప్పి తమ షాప్ వద్దకు రావాలని వృద్ధ దంపతులను కోరగా అక్కడికీ వెళ్లారు. వృద్ధురాలిని అక్కడే కూర్చోమని చెప్పి సుదర్శన చారీని బైక్‌పై తీసుకెళ్లి పట్టణంలోని ఓ షాప్ వద్ద దించి తిరిగి వృద్ధురాలి దగ్గరకు వచ్చాడు. లాటరీ డబ్బులు కావాలంటే నీ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు ఇస్తే తూకం వేసి మళ్లీ తిరిగి మీ భర్తతో ఇక్కడికి వస్తానని ఆమెకు చెప్పి తీసుకొని పారిపోయాడు. కొద్దిసేపటికీ సుదర్శనచారి తిరిగి తన భార్య వద్దకు వచ్చి జరిగిన విషయం తెలుసుకొని మోసపోయినట్లు గ్రహించి లబోదిబోమన్నారు. అనంతరం వారి అల్లుడు రాజమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

గజ్వేల్‌రూరల్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టిన ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. గజ్వేల్ పోలీసుల కథనం ప్రకారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(బ్రాహ్మణ బంజేరుపల్లి)కి చెందిన సుతారి కిష్టయ్య, సత్తవ్వ(48)దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. వీరు బంధువుల ఇంట్లో జరిగే కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై ఆదివారం కాసులాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలోని అహ్మదీపూర్ చౌరస్తా దాటిన తర్వాత పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తవ్వకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, కిష్టయ్యకు తీవ్రగాయాలై రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో కిష్టయ్యను 108లో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిష్టయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. సత్తవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



జిన్నారం (పటాన్‌చెరు): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డపోతారం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. గడ్డపోతారం గ్రామ శివారులో ఓ గుర్తు తెలియని వ్యక్తి (45)ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పారిశ్రామిక వాడలోని ఎంఎస్ఎన్ పరిశ్రమలో పనిచేసే కార్మికుడు ముత్తావరపు సతీశ్ ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పంటలకు అడవి పందుల బెడద

- లక్షలు ఖర్చు పెట్టి సాగు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు


అడవి పందులు ధ్వంసం చేసిన జొన్న పంట

జహీరాబాద్ టౌన్: అడవి పందుల బెడద రోజు రోజుకు అధికమవుతోంది. చేతికి వచ్చిన పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పాటు మనుషులపై దాడులు చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు పొలాల చుట్టూ వేసిన ఫెన్సింగ్ తీగలు సైతం రైతుల ప్రాణాలు తీస్తున్నాయి. రైతులు సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం సేద్యం చేసి, లక్షల పెట్టుబడి పెట్టి పండిస్తున్న అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. విత్తనం నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతన్నలకు అడవి పందులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జహీరాబాద్ వ్యవసాయ డివిజన్‌లో రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో అధికశాతం చెరకు, మొక్కజొన్న, జొన్న, పత్తి, సోయాబీన్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. వర్షాల వల్ల పంటలు దెబ్బతినడం, పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం తదితర కారణాల వల్ల రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. మరో వైపు పంటలకు అడవి పందులు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో అవి దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. తదితర పంటలను కొరికి నేలపాలు చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

పంటలను ధ్వంసం చేయడమే కాకుండా మనుషులపై దాడులు చేస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామానికి చెందిన షహీన్ సుల్తానా శుక్రవారం జొన్న చేను వద్దకు వెళ్లింది. అక్కడ పనులు చేస్తుండగా ఒక్కసారిగా పందులు దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. అడవి పందుల నుంచి పంటల రక్షణ కోసం ఇటీవల గోవింద్‌పూర్ గ్రామంలో ఫెన్సింగ్ తీగలకు కరెంట్ కనెక్షన్ ఇస్తుండగా షాక్ తగిలి అన్నదమ్ములిద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. అడవి పందుల బారి నుంచి పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.


పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్